సాక్షి
ప్రకాశం
గురువారం । 13 । ఏప్రిల్ । 2023



దిగ్విజయంగా రాజశ్యామల యాగం
ఒంగోలులో రాజశ్యామల యాగాన్ని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు.
- 8లో..



బాధ్యతలు స్వీకరించిన జేసీ
జిల్లా జాయింట్ కలెక్టర్‌గా కె.శ్రీనివాసులు బుధవారం మధ్యాహ్నం ప్రకాశం భవనంలో బాధ్యతలు స్వీకరించారు.
- 8లో..

గరిష్టం/కనిష్టం
39 /26

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. ఉక్కపోతగా ఉంటుంది.

ఇఫ్తార్ : సా॥ 06:30 ని॥
గురువారం
సహర్ : ఉ॥ 04:34 ని॥
శుక్రవారం
రంజాన్ వేళలు



సభలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వేదికపై బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్ కుమార్, ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, బుర్రా మధుసూదన్‌యాదవ్, టీజేఆర్ సుధాకర్‌బాబు, మద్దిశెట్టి వేణుగోపాల్, కరణం బలరాం, అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యేలు జంకె వెంకటరెడ్డి, గరటయ్య, కదిరి బాబూరావు, నాయకులు కరణం వెంకటేష్, వరికూటి అశోక్‌బాబు, సత్యనారాయణరెడ్డి



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్

పురం జనసంద్రం

- సీఎం సభకు భారీగా తరలివచ్చిన జనం
- కిక్కిరిసిన సభా ప్రాంగణం
- వెలుపలా వెల్లువగా తరలివచ్చిన ప్రజలు
- జగన్నినాదంతో మార్మోగిన పట్టణం
- పూలజల్లి అభిమానాన్ని చాటుకుని..
- వరాలతో హర్షాతిరేకాలు
- అక్టోబర్‌లో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం



సభకు హాజరైన అశేష జనవాహినిలో ఒక భాగం

మార్కాపురం:

మార్కాపురం జనసంద్రంగా మారిపోయింది. ఈబీసీ నేస్తం రెండో విడత ప్రారంభోత్సవానికి బుధవారం మార్కాపురానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వచ్చారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా భారీ ఎత్తున ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. పశ్చిమ ప్రకాశం వైఎస్సార్ సీపీ అడ్డా అని మరోమారు నిరూపించారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం పట్టణ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు సీఎం జగన్ చేరుకున్నారు. అక్కడ నుంచి ప్రత్యేక బస్సులో సభా ప్రాంగణానికి బయలుదేరారు. మున్సిపల్ కార్యాలయం, పాత బస్టాండ్, దోర్నాల సెంటర్, కాలేజి రోడ్డు మీదుగా డిగ్రీ కళాశాల ప్రాంగణం వరకు రోడ్లకు ఇరువైపులా వేలాది మంది ప్రజలు ఘనస్వాగతం పలికారు. కాన్వాయ్‌పై పూలు జల్లుతూ జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. గిద్దలూరు, యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పుల్లల చెరువు దాక మార్కాపురం మండలంలోని శివారు గ్రామాలైన గొట్టిపడియ, గజ్జలకొండ గ్రామాలతో పాటు తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల్లోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ అభిమానులు, మహిళలు సభాప్రాంగణానికి ఉదయం 9 గంటలకే చేరుకున్నారు. సభాప్రాంగణం నిండిపోవడంతో ఎండలోనే పెద్దఎత్తున జనం బయటే ఉండి సీఎం ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. సీఎం వేదికపైకి రాగానే జై జగన్ నినాదాలతో సభా ప్రాంగణం మారుమోగింది. ఆయన ప్రసంగాన్ని ఆద్యంతం ఆసక్తిగా విన్నారు. ఎల్లోమీడియా, చంద్రబాబులపై చేసిన విమర్శలకు సభలో ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది.

వరాల జల్లు కురిపించిన జగన్:

''నా తమ్ముడు నాగార్జునరెడ్డి అడిగిన కోరికలన్నీ తీరుస్తున్నాను. ఇప్పుడే కొన్ని పథకాలకు భూమి పూజ కూడా చేసి శిలఫలకాలను ఆవిష్కరించానని'' సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. దీంతో సభా ప్రాంగణంలో ప్రజలు జై జగన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. 40 ఏళ్ల నుంచి పరిష్కారం కాని పొదిలి నీటి సమస్య పరిష్కారానికి రూ.50 కోట్లతో నీటి పథకాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మార్కాపురానికి కూడా నీటి సమస్య నివారణకు రూ.5 కోట్లు కేటాయించామని అన్నారు.మార్కాపురం పట్టణంలో పెండింగ్‌లో ఉన్న సమస్యను కూడా పరిష్కరిస్తున్నానని హామీ ఇచ్చారు. మెడికల్ కాలేజికి సంబంధించి ఐదుగురు రైతులకు ఒక్కొక్కరికి రూ.3 లక్షలు చొప్పున ల్యాండ్ డెవలప్‌మెంట్ కోసం ఇస్తున్నానని ప్రకటించడంపై హర్షం వ్యక్తమైంది. పొదిలి మెయిన్ రోడ్డు డెవలప్‌మెంట్‌కు సంబంధించి రూ.11 కోట్లు, షాదీఖానాకు రూ.2 కోట్లు, మార్కాపురం పట్టణంలో అంబేడ్కర్ భవన్, బీసీ భవన్ కూడా నిధులు మంజూరు చేస్తున్నానని వేలాది మంది ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. దీనికి ఎమ్మెల్యే కేపీ ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. పొదిలి, మార్కాపురం నీటి సమస్యకు సీఎం పరిష్కారం చూపడంతో మార్కాపురం, పొదిలి ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.అలాగే వెలిగొండ ప్రాజెక్టును అక్టోబరులో ప్రారంభిస్తానని ప్రకటించడంతో జనం నుంచి పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ దగ్గర ఉండి ఏర్పాట్లను పరిశీలించారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి పలు సూచనలు చేశారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, మద్దిశెట్టి వేణుగోపాల్, బుర్రా మధుసూదన్ యాదవ్, టీజేఆర్ సుధాకర్ బాబు, కరణం బలరామ్, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, మాజీ ఎమ్మెల్యేలు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి, బాచిన చెంచు గరటయ్య, కదిరి బాబూరావు, శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణ చైతన్య, కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్చార్జ్ వరికూటి అశోక్‌బాబు, చీరాల ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్, రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతల చెరువు సత్యనారాయణరెడ్డి, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, మంత్రి సురేష్ సోదరుడు సతీష్, మార్కాపురం మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, రాష్ట్ర కార్యదర్శులు షంషీర్ అలీబేగ్, వెన్నా హనుమారెడ్డి, అన్నా కృష్ణచైతన్య, శిద్దా సుధీర్, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్లు మేడా బద్రి, ఎస్ కొండయ్య, కేవీ రమణా రెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ జయలక్ష్మి, కమిషనర్ మల్లికార్జున, జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, ఎంపీపీ చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ మలికాగర్గ్, సబ్‌కలెక్టర్ సేథుమాధవన్, జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, స్పెషల్ కలెక్టర్ సరళా వందనం, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఈబీసీ లబ్ధిదారులతో సమావేశం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సభా ప్రాంగణంలో ఈబీసీ లబ్ధిదారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈబీసీ పథకాన్ని తాము ఎలా ఉపయోగించుకుంటున్నది లబ్ధిదారులైన మహిళలు వివరించారు.

నీటి పథకాలకు శంకుస్థాపన చేసిన సీఎం:

మార్కాపురం, పొదిలి పట్టణాల్లో శాశ్వతంగా నీటి సమస్యను నివారించే సాగర్ నీటి పథకాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన శిలా ఫలకాలను ఆయన ఆవిష్కరించారు.



ఈబీసీ నేస్తం లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్, ప్రజాప్రతినిధులు



అభివృద్ధి ప్రదాత జగన్: ఎమ్మెల్యే కేపీ



మార్కాపురం/మార్కాపురం టౌన్: ఈబీసీ రెండో విడత ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలిసారిగా మార్కాపురం నియోజకవర్గానికి రావడం మనందరి అదృష్టం అని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ ''నియోజకవర్గానికి సంబంధించి రెండు కీలక పథకాల శిలఫలకాలు సీఎం ఆవిష్కరించారు. ఒకటి పొదిలి పెద్ద చెరువు 40 సంవత్సరాల కల, రూ.50 కోట్లతో చేపట్టనున్న పనులకు సంబంధించి శిలాఫలకం ఆవిష్కరించినందుకు సీఎంకు పాదాభివందనం చేస్తున్నా. మార్కాపురం పట్టణానికి తాగునీటి అవసరాల నిమిత్తం నా తండ్రి అప్పటి ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి అడిగిన వెంటనే అప్పటి సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిధులు మంజూరు చేశారు. వైఎస్సార్ చలువతో మొదటి దశ ప్రారంభమైంది. 14 ఏళ్ల నిరీక్షణ తర్వాత నేడు రెండో దశను జగన్ ప్రారంభించారు. 10 వార్డులకు నీటి సరఫరా లేదు. సాగర్ పైప్ లైన్ లేదు. ఈ రోజు వరకు పట్టించుకున్న నాథుడు లేడు. మిగిలిన పది వార్డులతో పాటు పట్టణానికి పూర్తి స్థాయిలో సాగర్ జలాలు అందించేందుకు పైప్‌లైన్లు పూర్తి చేసేందుకు సంబంధించి మరో శిలాఫలకాన్ని ఆవిష్కరించినందుకు జగన్‌కు రుణపడి ఉంటాం. అలాగే పశ్చిమ ప్రకాశాన్ని ఆరోగ్యపరంగా ఆదుకునేందుకు మెడికల్ కళాశాల ఇచ్చినందుకు ధన్యవాదాలు. గడచిన 4 సంవత్సరాల్లో మార్కాపురంలో అభివృద్ధి పనులకు వెచ్చించింది దాదాపు రూ.1100 కోట్లు. నాడు-నేడు పథకం ద్వారా మీరు ఈ రోజు హెలిప్యాడ్ దిగిన స్కూల్లో రూ.3.60 కోట్లతో బాగుచేశారు. పేద పిల్లలందరూ చక్కగా చదువుకుంటున్నారు. మీ స్ఫూర్తితో నియోజకవర్గంలో టీచర్స్ అందరూ కలసి ఇగ్నేట్ యంగ్ మైండ్స్ అనే ప్రోగ్రామ్‌తో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ ఇస్తున్నాం. నేను కూడా ప్రతి నెలా 1, 2 సెక్షన్ క్లాసులు తీసుకుంటున్నాను. వెలిగొండ ప్రాజెక్టు మొదలు పెట్టింది డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అయితే పూర్తి చేసేది మాత్రం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డే.

నిధులు ఇవ్వండి..

మార్కాపురం పట్టణంలో షాదీఖానా, అంబేడ్కర్ భవన్, బీసీ భవన్, పొదిలిలో మెయిన్ రోడ్డు, డ్రైనేజ్ వ్యవస్థలు పూర్తి చేయాల్సి ఉంది. మెడికల్ కాలేజీకి రైతులు 13 ఎకరాలు ఇచ్చారు. వారికి నష్టపరిహారంగా ఒక్కో రైతుకు రూ.3 లక్షలు ఇవ్వాలి. ఈ రోజు సభకు వచ్చిన ప్రతి ఒక్కరికీ మీతో ఫొటో దిగాలని కల. కచ్చితంగా 2025లో మీరు మార్కాపురం నియోజకవర్గానికి సీఎం హోదాలో వచ్చి రోజంతా మాతో ఉండాలని కోరుతున్నాను'' అని ఎమ్మెల్యే కేపీ అన్నారు.



సీఎం జగన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

ఎమ్మెల్యే కేపీ కుటుంబ సభ్యులతో మాటామంతి



మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డిని పరామర్శిస్తున్న సీఎం వైఎస్ జగన్

హెలిప్యాడ్ వద్ద ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి కుటుంబ సభ్యులతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమావేశమయ్యారు. మాజీ ఎమ్మెల్యే కేపీ కొండా రెడ్డి, సుబ్బమ్మ, ఎమ్మెల్యే సతీమణి కల్పన, సోదరుడు కృష్ణ మోహన్ రెడ్డిలతో ప్రత్యేకంగా మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కేపీ కొండా రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.



హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ మలికాగర్గ్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి, ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, బుర్రా మధుసూదన్‌యాదవ్, అన్నా రాంబాబు, టీజేఆర్ సుధాకర్‌బాబు, మద్దిశెట్టి వేణుగోపాల్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబు



సీఎంకు స్వాగతం పలికేందుకు రోడ్డుకు ఇరువైపులా వేచి ఉన్న ప్రజలు



సీఎం జగన్‌కు పూలతో స్వాగతం పలుకుతున్న మహిళలు



సీఎంను స్వాగతించేందుకు మిద్దెలపైకి ఎక్కి అభివాదం చేస్తున్న ప్రజలు

క్లుప్తంగా

సీఎం పర్యటన విజయవంతం

● ఎస్పీ మలికాగర్గ్

తర్లుపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మార్కాపురం పర్యటన విజయవంతమైందని ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఎం పర్యటనలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన వ్యవస్థ ద్వారా విజయవంతం చేసినట్లు చెప్పారు. అన్ని శాఖల సమన్వయంతో సీఎం పర్యటన విజయవంతమైందని, సహకరించిన అధికారులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన జేసీ

● అధికారులు, ఉద్యోగ సంఘాల అభినందన



జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా కె.శ్రీనివాసులు బుధవారం మధ్యాహ్నం ప్రకాశం భవనంలో బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఉన్న ఆయన బదిలీపై జిల్లాకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన జేసీని పలువురు అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం కలెక్టరేట్ విభాగ పర్యవేక్షకులతో జేసీ సమావేశమయ్యారు. జిల్లాలో భూముల రీ సర్వే, స్టోన్ ప్లాంటేషన్ తదితర అంశాలపై సమీక్షించారు.

14న అంబేడ్కర్ జయంతి సభ

ఒంగోలు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి మహోత్సవం ఈనెల 14న స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక హెచ్‌సీఎం సెంటర్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి, 10.15 గంటలకు స్థానిక కోలాస్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాలంకరణ చేసి నివాళులర్పిస్తామన్నారు. అనంతరం అంబేడ్కర్ భవన్ జయంతి సభ నిర్వహిస్తామని, జిల్లాలోని రాజకీయ నాయకులు, అధికారులు, దళిత నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

గూడ్స్ రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



టంగుటూరు వద్ద రైల్వే ట్రాక్‌పై మృతదేహం

టంగుటూరు: గూడ్స్ రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. సుమారు 50 ఏళ్ల వయసు కలిగిన పురుషుడు రైల్వే ట్రాక్ పైన చనిపోయి ఉన్నాడు. మృతుడి శరీరంపై సిమెంటు రంగు ప్యాంటు, తెలుపు రంగు చొక్కా ఉన్నాయి. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఒంగోలు రైల్వే ఎస్సై పి.వెంకటేశ్వర్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9490566577, 9440627647, 9949761057ను సంప్రదించాలని ఎస్సై సూచించారు.

సీఎంకు యాదాల అశోక్ బాబు వినతి



సీఎంకు వినతిపత్రం అందిస్తున్న డాక్టర్ యాదాల అశోక్‌బాబు

ఒంగోలు: ఈబీసీ నేస్తం పథకాన్ని ప్రారంభించేందుకు మార్కాపురానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్పెషలాఫీసర్ డాక్టర్ యాదాల అశోక్‌బాబు కలిసి వినతిపత్రం అందించారు. కోవిడ్ అనంతరం ఎక్కువగా గుండె సంబంధిత వ్యాధులు వెలుగులోకి వస్తున్నాయని, ఈ నేపథ్యంలో గుండె జబ్బులకు సంబంధించి ఆపరేషన్లు కూడా ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎంకు విజ్ఞప్తిచేశారు. ఇందుకు ఏం అవసరం తెలియజేస్తూ వివరాలతో కూడిన వినతిపత్రాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అందించారు.



అన్నొచ్చాడు.. సభా ప్రాంగణానికి చేరుకున్న సీఎం వైఎస్ జగన్‌ను చూసిన ఆనందంలో అక్కచెల్లెమ్మలు



జయజయహో.. సీఎం వైఎస్ జగన్ రాకను స్వాగతిస్తూ అభిమానుల హర్షాతిరేకాలు



సీఎం జగన్‌ను చూసేందుకు.. ఓ అవ్వ సాహసం

అదే అభిమానం.. అంతులేని ఉత్సాహం



యువతుల కేరింత

ఈబీసీ నేస్తం రెండో విడత ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం మార్కాపురం పట్టణంలో అట్టహాసంగా సాగింది. మండుటెండను సైతం లెక్కచేయకుండా ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చారు. హెలీప్యాడ్ నుంచి సభా ప్రాంగణానికి బస్సులో బయలుదేరిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అభిమానులు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. జగన్నినాదాలతో సభాస్థలి హోరెత్తింది. సాంస్కృతిక కార్యక్రమాలు అభిమానులను ఆద్యంతం అలరించాయి. సభకు హాజరైన ప్రజలకు ఉచిత వైద్యసేవలందించారు.

– మార్కాపురం



సీటీమార్.. జగన్ ప్రసంగం వింటూ విజిలేస్తున్న మహిళ



సెల్‌చల్.. సీఎం ప్రసంగాన్ని చిత్రీకరిస్తున్న యువతులు



యువకుల ఉత్సాహం



కిక్కిరిసిన అభిమానం: ఈబీసీ నేస్తం సభకు పోటెత్తిన లబ్ధిదారులు, అభిమానులు



అన్నను చూడాలని..





ప్రత్యేక ఆకర్షణగా జై జగన్ బెలూన్



సభా ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం



గిరిజన సంప్రదాయ నృత్యాలతో సందడి..



కటౌట్ రైడ్..

రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రామలక్ష్మి

ముండ్లమూరు: రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని మరో బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో ఓ యువతి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన దర్శి–అద్దంకి ప్రధాన రహదారిలో ముండ్లమూరు మండలం పెద ఉల్లగల్లు వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలు.. దర్శి మండలం రాజంపల్లి గ్రామానికి చెందిన జాష్టాది నరసింహారావు, విజయలక్ష్మి దంపతుల రెండో కుమార్తె రామలక్ష్మి(20) దర్శిలోని ఓ ప్రైవేట్ కాలేజీలో బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతోంది. తన స్నేహితుడు ముచగాని గోపితో కలిసి ద్విచక్ర వాహనంపై కొరిశపాడు మండలం రావినూతలలో యూనియన్ బ్యాంక్‌కు బయలుదేరింది. మార్గమధ్యంలో పెద ఉల్లగల్లు వద్ద రోడ్డుపై నిలిపిన ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న రామలక్ష్మి రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. యువతి చున్నీ బైక్ అద్దానికి చుట్టుకోగా దానిని తొలగించే క్రమంలో ప్రమాదం సంభవించినట్లు స్థానికులు చెప్పారు. మృతురాలి స్నేహితుడు గోపి ఇచ్చిన సమాచారంతో తల్లిదండ్రులు ప్రమాద స్థలం వద్దకు చేరుకుని బోరున విలపించారు. హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పొగాకు బేళ్లు దగ్ధం

● రూ.6 లక్షలకు పైగా ఆస్తినష్టం

మద్దిపాడు: కొష్టాలు, గడ్డివాములు, పొగాకు బేళ్లు తగలబడి రూ.6 లక్షలకు పైగా ఆస్తి నష్టం సంభవించింది. ఈ సంఘటన బుధవారం మధ్యాహ్నం మండలంలోని నేలటూరులో జరిగింది. వివరాల్లోకి వెళితే..నేలటూరు గ్రామానికి చెందిన వాకా రామకృష్ణారెడ్డి కొష్టం పక్కన ఉన్న గడ్డివామి తగలబడడంతో వరుసగా కంది శేషిరెడ్డికి చెందిన గడ్డివామి, తిప్పారెడ్డి అంజమ్మకు చెందిన కొష్టం, కంది అంజిరెడ్డికి చెందిన రేకుల షెడ్డు, వాకా అశోక్‌రెడ్డికి చెందిన కొష్టం పక్కనే ఉన్న కంది శ్రీనివాసరెడ్డికి చెందిన రేకలపందిరి మంటల్లో కాలిపోయాయి. ఈ క్రమంలో వాకా రామకృష్ణారెడ్డికి చెందిన 10 పొగాకు బేళ్లు, అశోక్‌రెడ్డికి చెందిన 4 పొగాకు బేళ్లు, కంది అంజిరెడ్డికి చెందిన 23 పొగాకు బేళ్లు కాలిపోయాయి. స్థానికులు తీవ్రంగా శ్రమించి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో రూ.6 లక్షలకు పైగా ఆస్తినష్టం సంభవించి ఉంటుందని అంచనా వేస్తున్నారు. సమాచారం అందుకున్న వీఆర్‌ఓ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి సమాచారాన్ని తహసీల్దార్ రజనీకుమారికి తెలిపారు.

పొగాకు బ్యారన్ దగ్ధం.. రూ.2.5 లక్షలు నష్టం

కొండపి: పొగాకు బ్యారన్‌లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి దగ్ధమైన సంఘటన మండలంలోని అనకర్లపూడి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పెద్దినేని శింగయ్య పొగాకు బ్యారన్‌లో సుమారు 1100 కర్రలకు పొగాకు అల్లి క్యూరింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో మొద్దు గొట్టంపై అల్లిక కర్ర జారిపడి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. ఈ బ్యారన్ పూర్తిగా కాలిపోగా, పక్కనే ఉన్న పెద్దినేని వెంకట్రావు బ్యారన్ పాక్షికంగా దగ్ధమైంది. ఈ సంఘటనలో శింగయ్యకు రూ.2.5 లక్షలు, వెంకట్రావుకు రూ.50 వేల ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న కొండపి అగ్ని మాపక సిబ్బంది మురళీకృష్ణ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

కంభం: స్థానిక రైల్వేస్టేషన్‌లోని మూడో ప్లాట్‌ఫామ్‌పై బుధవారం రాత్రి ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. రైల్వే డబుల్ పనుల్లో భాగంగా రైలు కమ్మీల లోడుతో వచ్చిన గూడ్స్ రైలు అన్‌లోడ్ చేసి వెళ్తున్న సమయంలో పట్టాలు తప్పింది. మూడో ప్లాట్‌ఫాంపై ఎటువంటి రైళ్లు వెళ్లనందున రాకపోకలకు అంతరాయం కలగలేదు. సంఘటన స్థలాన్ని రైల్వే పోలీసులు, అధికారులు పరిశీలించారు.



పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

దిగ్విజయంగా రాజశ్యామల యాగం



పూజలు చేస్తున్న బాలినేని దంపతులు

ఒంగోలు టౌన్: టీటీడీ కల్యాణ మండపంలో రెండో రోజు బుధవారం రాజశ్యామల యాగం విజయవంతంగా జరిగింది. వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులతో వేద పండితులు మతంపల్లి దక్షిణామూర్తి నేతృత్వంలో యాగాది క్రతువులు చేయించారు. ప్రదోష కాల పూజలు, మహా గణపతి, మహా మృత్యుంజయ తదితర యాగ క్రతువులు జరిపించారు. అనంతరం రాజశ్యామల మాతకు సప్త హారతులు, మహా మంత్రపుష్పం నిర్వహించి అమ్మవారికి దర్బార్ సేవ నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవం

ముండ్లమూరు: మండలంలోని ఉమామహేశ్వరపురం గ్రామానికి చెందిన యద్దనపూడి రామకోటయ్య హత్య కేసులో నిందితుడు ఒంటేరు శ్రీనుకు యావజ్జీవ ఖైదు, రూ.2 వేల జరిమానా విధిస్తూ మార్కాపురం కోర్టు అదనపు జిల్లా జడ్జి టి.రాజా వెంకటాద్రి బుధవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్సై ఎల్.సంపత్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. 2015 మార్చి 19వ తేదీన ఉమామహేశ్వరపురం గ్రామానికి చెందిన యద్దనపూడి రామకోటయ్యను అదే గ్రామానికి చెందిన ఒంటేరు శ్రీను గొడ్డలితో నరికి హత్య చేశాడు. తన తల్లితో యద్దనపూడి రామకోటయ్య అక్రమ సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో కాపు కాచి హత్యకు పాల్పడ్డాడు. మృతుని కుమారుడు యద్దనపూడి శ్రీను స్థానిక పోలీస్ స్టేషన్‌లో అదే రోజు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. మార్కాపురం కోర్టులో ఆధారాలు సమర్పించారు. ఈ మేరకు నిందితుడికి యావజ్జీవ శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తుది తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దొండపాటి గాంధీ రెడ్డి వాదనలు వినిపించారు. ఈ కేసులో హెడ్ కానిస్టేబుల్ ఐవీ శ్రీనివాసరావు, కోర్టు కానిస్టేబుల్ శ్రీను న్యాయస్థానానికి సహకరించినట్లు తెలిపారు. కాగా నిందితుడి శిక్ష పడేలా దర్యాప్తు చేపట్టి, కోర్టుకు తగిన ఆధారాలు సమర్పించేందుకు కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ మలికాగర్గ్ అభినందించారు.